క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం సుజాత నగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరాట్టు ఉత్సవం చేస్తామని పేర్కొన్నారు. భక్తులంతా తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీదేవికి స్నపనం


అమ్మవారికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. 15 రకాల ద్రవ్యాలతో శుద్ధోదక స్నపనం జరిగింది. విశేష అలంకరణ చేసి మహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు.అష్టోత్తర శతనామ అర్చనలు చేశారు. సోమవారం మహాలక్ష్మి అమ్మవారి జన్మనక్షత్రం పురస్కరించుకుని సుదర్శన హోమం, విశేష పూజలు చేస్తామని చెప్పారు.

పైప్‌లైన్ పనులు ఆపాలని ఆందోళన

పరవాడ: తాడి సమీపంలోని గ్రీన్‌బెల్ట్ మీదుగా నిర్మిస్తున్న పైపులైన్ పనులను తక్షణమే నిలిపివేయాలని తాడి గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. పైపులైన్ పనులు ఆపాలని కోరుతూ గ్రామ ప్రజలు ఆదివారం వార్డు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు మాట్లాడుతూ ఫార్మా కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామాన్ని తరలించిన తర్వాత పైపులైన్ పనులు చేపట్టాలని.. అంతవరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆందోళనను లెక్క చేయకుండా పైపులైన్ పనులు చేపడితే ఆందోళనను ఉధృతం చేస్తామని మాజీ ఎంపీపీ నీలబాబు హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు జి.కనకరాజు, జి.మాధాలరావు, కె.కులదీప్‌రాజ్, మాదంశెట్టి సూరిబాబు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆనందపురం : మండలంలోని గంభీరంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. గంభీరం గ్రామ సమీపాన గెడ్డలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ అప్పలనాయుడు, ఆనందపురం సీఐ తిరుపతిరావు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ మేరకు అక్కడ పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

మండలంలోని శిర్లపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ తిరుపతిరావు చెప్పారు. అందిన సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో తనిఖీలు చేయగా అక్రమంగా ఓ వ్యక్తి 30 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు.

ఆరోగ్య భరోసా

నాడు: సాధారణ, మధ్య తరగతి కుటుంబాల్లో వ్యక్తులు జబ్బు బారిన పడితే అంతే సంగతులు.. బతుకు మీద ఆశలు వదులుకుని కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడం..లేదా జీవితాలు తాకట్టుపెట్టి అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరడం మించిన గత్యంతరం లేదు.

నేడు: పరిస్థితి మారింది. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు మార్చింది. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చింది. సకల వసతులు కల్పించింది. ఫలితంగా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వాస్పత్రిలో పేదోడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోంది. దీంతో తమకు వైద్య భరోసా లభించిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కోట్లాది రూపాయలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం
- పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు
- అన్ని రకాల రక్త, ఇతర ఆరోగ్య పరీక్షలు ఉచితమే

పెందుర్తి: దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. నిరుపేదలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లకు శ్రీకారం చుట్టింది. ఈ హెల్త్ సెంటర్లలో ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయి. రక్త పరీక్షల నుంచి మందుల వరకూ అన్నీ ఉచితంగా అందిస్తోంది.

కార్పొరేట్ ఆస్పత్రిని తలపించేలా:

నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. ప్రతి ఆస్పత్రిలో విశాలమైన ఓపీ హాల్, పది ఆధునిక బెడ్‌లతో కూడిన ఆహ్లాదరకమైన వార్డు. రక్త, ఇతర పరీక్షల కోసం ఆధునిక వసతులతో ల్యాబ్ ఏర్పాటు చేశారు. నిరంతర పర్యవేక్షణ చేసే వైద్యాధికారితో పాటు 6నుంచి 8 మంది సిబ్బందిని నియమించారు.వైద్యం కోసం వచ్చే ప్రజల కోసం వైద్య నిపుణులు నిర్దిష్ట సమయంలో అందుబాటులో ఉంచుతున్నారు. శుక్రవారం గర్భిణుల కోసం గైనకాలజిస్ట్, చెవి, ముక్కు, గొంతు సమస్యల కోసం ఈఎన్‌టీ డాక్టర్ అందుబాటులో ఉంటారు. శనివారం ఎముకల, దంత వైద్యులు, గురువారం చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో ఉంటారు. అన్ని రకాల జ్వరాలకు, ఇతర సమస్యలకు ఇక్కడే రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తారు. వ్యాది నిర్ధారణ చేసుకుని తగిన మందులు ఉచితంగా అందిస్తున్నారు. పరీక్షల్లో జబ్బు పెద్దది అయితే ఆరోగ్యశ్రీ ద్వారా రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు


రోగికి రక్త నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలో రూ.1.21 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్


రోగికి ప్రాథమిక వైద్య పరీక్షలు చేస్తున్న నర్స్


చినముషిడివాడ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన పడకలు

వైద్య సేవలు బాగున్నాయి



గతంలో ప్రభుత్వాసుపత్రిలో వసతులు, వైద్యులు సరిగా లేక చాలా ఇబ్బందులు పడేవాళ్ళం. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే ప్రవేటు ఆసుపత్రికి రూ.వేలల్లో ఖర్చు అయ్యేది. అయితే మా ఊళ్ళోనే ఇంత పెద్ద ఆసుపత్రి ఏర్పాటు చేసి రూపాయి ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఏదైనా ఇబ్బంది అనుకుంటే ఇంకా మంచి ఆసుపత్రికి ఉచితంగా పంపుతున్నారు. ప్రభుత్వం చాలా మంచి చేసింది.

– టి.సీతమ్మ, మరిడిమాంబ కాలనీ, పురుషోత్తపురం

రక్త పరీక్షలూ ఉచితమే



ప్రైవేటు ఆస్పత్రికి వెళితే ఏ చిన్న అనుమానం ఉన్నా రక్తం, ఇతర పరీక్షల కోసం రూ. వేలల్లో దండుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఏ ఇబ్బంది వచ్చినా ఇక్కడకు వచ్చి ఉచితంగా పరీక్షలు చేసుకుని తగిన మందులు ఉచితంగా తీసుకుంటున్నాం. వైద్యులు కూడా నిర్దిష్ట సమయంలో అందుబాటులో ఉంటున్నారు. వైద్య సేవలు చాలా బాగున్నాయి.పేదలకు భరోసా ఇస్తున్నాయి.

– ఎం.రాజు, పాపయ్యరాజు పాలెం

ఉత్సాహంగా విలేజ్ క్రికెట్ టోర్నీ ఆరంభం


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి ముత్యమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే అన్నంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొద్ది సేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. క్రీడలు శారీక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఆయన తెలిపారు. గ్రామ స్థాయిలో ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. టోర్నీకి పంచాయతీ పరిధిలోని 12 జట్లు పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు,ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు చెప్పారు. టోర్నమెంట్‌లో మేన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్‌కు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సింహగిరిపై కామదహనం పూజలు


సింహగిరిపై హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై ఆదివారం రాత్రి కామదహనం పూజలను విశేషంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను తిరువీధిగా మాడవీధుల్లో తీసుకెళ్లి జోడు భద్రాల వద్ద అధిష్టంపజేసి హోమం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వేద పండితులు, అర్చకులు ఈ పూజలు చేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాస శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 దర్శనాలు కల్పించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ లండ రమణ, సిబ్బంది, కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యాలు పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రావణ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం


శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

పెందుర్తి: మట్టల ఆదివారం సందర్భంగా సుజాత నగర్‌లోని అగాపే క్రిస్టియన్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేశారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్ రెవ థామస్ ప్రవీణ్ ఏసు సందేశం వినిపించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు ర్యాలీలో పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారం ప్రార్థనలు నిర్వహించారు. సబ్బవరంలోని రోమన్ క్యాథలిక్ చర్చిలో ప్యారిస్ ప్రీస్ట్ థామస్ పులికల్‌తో పాటు విశాఖ ఆటోనగర్‌కు చెందిన ఫాదర్ జోసెఫ్ ప్రార్థనలు నిర్వహించారు.యువత భక్తిగీతాలు ఆలపించారు. ఏసు క్రీస్తును యూదులు గాడిదపై ఊరేగిస్తూ ఈత మట్టలు చేతబూని తీసుకెళ్లే సన్నివేశాలను ఇక్కడి క్యాథలిక్ క్రైస్తువులు ప్రదర్శించారు.అనంతరం ఉపవాస దీక్షలో ఉన్న క్రైస్తవ భక్తులకు సత్ప్రసాదం పంపిణీ చేశారు. మడక పుష్పలత,ఆడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సబ్బవరం ఫాతిమా మాత చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.

తనిఖీలు విస్తృతం

అదనపు ఎస్పీ విజయభాస్కర్


చెక్‌పోస్టు వద్ద పోలీసు బలగాలకు సూచనలిస్తున్న అదనపు ఎస్పీ విజయభాస్కర్


వాహనాల తనిఖీలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ విజయబాస్కర్

పరవాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యలో నిర్దేశించిన చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ సిబ్బందిని ఆదేశించారు. దేశపాత్రునిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. వాహనాల తనిఖీలో సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. డబ్బు, మద్యం, నాటు సారా, గంజాయి, ఉచిత కానుకలు పంపిణీని అడ్డుకోవడానికి ప్రత్యేక నిఘా పెట్టినట్టు చెప్పారు. విధుల్లో ఉన్న పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలు పటిష్ఠ తనిఖీలు జరపాలని అదనపు ఎస్పీ విజయభాస్కర్ సూచించారు. అదనపు ఎస్పీ వెంట పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి వ్యవస్థలే ముఖ్యం




మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నకుమార్, కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

సీతంపేట: ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ అన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్, విశాఖ పబ్లిక్ లైబ్రరీ సంయుక్తంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయశంకర్ రచించిన గ్రంథం 'వై భారత్ మేటర్స్'పై జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తులు మారినా సంస్థలు శాశ్వతంగా నిలిచి ఉంటాయన్నారు. న్యాయవాది ఎం.రామదాస్ మాట్లాడుతూ జయశంకర్ రచించిన పుస్తకంలోని ముఖ్య అంశాలను సమీక్షించారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడానికి తగిన వనరులున్నాయని, వ్యవస్థల మధ్య సమన్వయంతో పాలన సాగాలన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావు, నరేంద్రమోదీ విధానాలను వివరించారు. మోదీ రాముడిని ఒక గొప్ప నాయకుడిగా చూపిస్తున్నారని, భారతీయ సంస్కృతి వైశిష్ట్యాన్ని లోకానికి చాటడానికి ప్రాధాన్యమిస్తున్నారని చెబుతూ, రామాయణంలోని మానవీయ కోణాన్ని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, రచయిత డి.వి.సూర్యారావు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ, కుంచాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం


అమృతపురంలో నిర్మించిన బంగారమ్మ,కుంచాలమ్మ అమ్మవార్ల ఆలయం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని అమృతపురంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ,కుంచాలమ్మ ఆలయ ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ,కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో చేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అపరాధ రుసుముతో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలో డి అండ్ వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులు ఈ నెల 31లోగా 25 శాతం అపరాధ రుసుముతో చెల్లించాలని ఏఎంవోహెచ్ శ్రీనివాసరావు కోరారు. ఏప్రిల్ ఒకటి నుంచి 50 శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి వుంటుందన్నారు. లైసెన్స్ ఫీజులు చెల్లించకుండా కొనసాగే వ్యాపారస్తులకు అనుమతులు రద్దు చేయడానికి సిఫారసు చేయనున్నట్టు హెచ్చరించారు.

కేంద్రానికి గుణపాఠం చెబుదాం


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం : ఉద్యమాలతో కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1,137వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వారికి అప్పగించాలన్న నిర్ణయానికి ఎదురు తిరిగిన కార్మిక వర్గానికి దెబ్బ కొట్టాలని చూస్తున్నారన్నారు. ఇందుకు అనుగుణంగా దొడ్డిదారిన స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి ఉక్కు యాజమాన్యంతో కలిసి విద్రోహ చర్యలు చేపట్టారని, సంస్థలో ప్రధాన విభాగాలను పాక్షికంగా నిలిపివేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఉక్కు నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఉద్యమ సెగ దేశవ్యాప్తంగా వెళ్లిందన్నారు. దీనికి మద్దతుగా కార్మికులంతా పెద్ద ఎత్తున ఉక్కు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.